సాక్షి ప్రకాశం

సోమవారం | 4 | సెప్టెంబర్ | 2023



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

లారీని మోటారుసైకిల్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన సింగరాయకొండ మండలంలో ఆదివారం రాత్రి జరిగింది.

- 8లో..



పేదింటి బిడ్డకు విదేశీ విద్య

పేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి విదేశీ విద్య పథకం కింద అమెరికాలో చదువుకునే అవకాశం దక్కింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

ఒంగోలు టౌన్: ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వర రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదీ విశాఖపట్నంలో ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. వెంకటేశ్వరరెడ్డి 14 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయ స్థాయిలో ఉత్తమ సేవలందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన రాసిన 30కి పైగా వ్యాసాలను ప్రచురితమయ్యాయి. యూజీసీ సహకారంతో ఒక మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టును పూర్తి చేశారు. ప్రభుత్వం ప్రచురించిన డిగ్రీ, పీజీ టెక్స్ట్ పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఒంగోలులో ఏడు జాతీయ సెమినార్లను నిర్వహించారు. ఆరు గ్రంథాలను రచించారు. వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి అకడమిక్ సంస్థల్లో సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వెంకటేశ్వరరెడ్డిని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, అధ్యాపకులు రాజమోహన్, సోమశేఖర్, గంగాధర్, జ్ఞానేశ్వరరెడ్డి, నిర్మలా మణి, పద్మజ, భారతి, శివాజీ, ఐ.దేవి వరప్రసాద్ తదితరులు అభినందించారు.

సామూహిక పండుగలతోనే ఐక్యత

- స్వామి పరిపూర్ణ సిద్ధానంద
- ఒంగోలు గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు



గణేష్ ఉత్సవ సమితి పతాకాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక బాలాజీరావుపేటలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఒంగోలు గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేశారు. సమితి అధ్యక్షునిగా సోమ సుబ్బారావు, కార్యదర్శిగా ఈమని బలరాం, కోశాధికారిగా ఇనమనమెళ్లూరి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అచలానంద ఆశ్రమ నిర్వాహకుడు పరిపూర్ణ సిద్ధానందస్వామి మాట్లాడుతూ సామూహికంగా పండుగల నిర్వహణ ద్వారానే సమాజంలో ఐక్యత వస్తుందన్నారు. రానున్న భాద్రపద చవితి నాడు వాడవాడలా వినాయకచవితి పండుగ నిర్వహించే కమిటీలు బాలభక్త సమాజాలను కలుపుకుని అత్యంత ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గణేష్ ఉత్సవ సమితి పతాకాలను, పోస్టర్లను ఆవిష్కరించారు. లింగంగుంట గ్రామ పురోహితుడు వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో భాగ్యనగరం తరహాలో గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు సోమ సుబ్బారావు మాట్లాడుతూ నగరంలోని ప్రతివీధి, కాలనీలో ఏర్పాటు చేసే వినాయక మండప కమిటీ సభ్యులందరూ గణేష్ ఉత్సవ కమిటీలో సభ్యులై వినాయక చవితి పండుగను జరుపుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం నగరంలో గణేష్ పతాకాలను చేపట్టి శోభాయాత్ర నిర్వహించారు. సమావేశంలో సమితి గౌరవ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు తానికొండ సురేష్ యాదవ్, కార్యదర్శి ఈమని బలరాం, ఉప కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు, ఒంగోలు కార్పొరేషన్‌లోని పలు డివిజన్ల వినాయక మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

మండుతున్న ఎండలతో వేసవిని తలపిస్తున్న భానుడి ప్రతాపాన్ని తగ్గించేలా వరుణుడు కరుణించాడు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కుంభవృష్టిగా కురిసిన వానతో వాతావరణం చల్లబడింది. వాగులు, చెరువులకు నీరు చేరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



పుల్లలచెరువు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

- ఒంగోలు పరిసర మండలాల్లో కుంభవృష్టి
- అత్యధికంగా గిద్దలూరులో 149.8 మి.మీ నమోదు

ఒంగోలు సిటీ: వానాకాలం ప్రారంభమైనా ఎండలు మండుతూనే వచ్చాయి. రోజూ 30 నుంచి 42 డిగ్రీలు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వరుణుడు దోబూచులాడటంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. శనివారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. జిల్లా అంతటా పలు ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీవర్షం కురిసింది. ఒంగోలు నగరంలో సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు జల్లులు కురిశాయి. రాత్రి 9 గంటలు దాటిన తర్వాత 12 గంటల వరకు కుంభవృష్టే. అలాగే టంగుటూరు, సింగరాయకొండ, కొండపి, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, మార్కాపురంలో రాత్రి 8 గంటల నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. గిద్దలూరులో కూడా అత్యధిక వర్షపాతం కురిసింది. గిద్దలూరులో అత్యధికంగా 149.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అర్ధవీడులో అత్యల్పం 3.4 మి.మీ కురిసింది. జిల్లా వ్యాప్తంగా 1858.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి సగటు 48.9 మి.మీ నమోదైంది. చీమకుర్తి లో 92.8 మి.మీ, పొన్నలూరులో 92.4 మి.మీ, మద్దిపాడులో 91.2 మి.మీ, సంతనూతలపాడులో 86.6 మి.మీ, కొండపిలో 80.4 మి.మీ, సింగరాయకొండలో 78.4 మి.మీ, దర్శిలో 77.2 మి.మీ, తాళ్లూరులో 75.2 మి.మీ, కొమరోలులో 74.6 మి.మీ, మర్రిపూడిలో 73.8 మి.మీ, హనుమంతునిపాడులో 68.4 మి.మీ, ఒంగోలులో 64.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లాలో వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

రాచర్ల	63.4	పెద్దదోర్నాల	26.8
పుల్లలచెరువు	63.0	కురిచేడు	26.4
త్రిపురాంతకం	58.4	తర్లుపాడు	24.8
కనిగిరి	53.6	ముండ్లమూరు	22.4
జరుగుమల్లి	42.4	పామూరు	22.4
నాగులుప్పలపాడు	41.2	మార్కాపురం	21.8
దొనకొండ	36.0	బేస్తవారిపేట	18.4
కంభం	32.8	టంగుటూరు	16.4
పొదిలి	32.6	పీ.సీ.పల్లి	14.8
సీఎస్.పురం	32.4	పెద్దారవీడు	8.8
కొనకనమిట్ల	28.2	వై పాలెం	8.6
వెలిగండ్ల	27.4	అర్ధవీడు	3.4
కొత్తపట్నం	26.8		

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

- వాగులో కొట్టుకుపోతున్న తండ్రి, కుమార్తెను కాపాడిన స్థానికులు
- నల్లమల అడవుల్లో భారీ వర్షం



నీటిలో చిక్కుకున్న తండ్రీ, కుమార్తె



వెంకటేశ్వర్లు



వైష్ణవి

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామానికి సమీపంలో గుట్టపల్లి–ముటుకుల మధ్య ఉన్న పెద్దవాగు వంతెన పై ద్విచక్ర వాహనం కొట్టుకుపోగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడిన సంఘటన మండలంలో ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తెల్లగట్ల గ్రామానికి చెందిన కొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, భార్య, కుమార్తె వైష్ణవిలతో కలిసి ఆదివారం ఉదయం వినుకొండకు మోటర్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఇతను వెళ్లేసరికి మార్గ మధ్యంలో ఉన్న పెద్దవాగు బ్రిడ్జి పై నుంచి నీరు భారీగా ప్రవహిస్తోంది. వెంకటేశ్వర్లు తన భార్యను ఇవతలి ఒడ్డున దించి కూతురుతో కలిసి వాహనంపై అవతలి ఒడ్డుకు వెళ్తుండగా వరద భారీగా రావడంతో వారు ప్రయాణిస్తున్న వాహనంతో పాటు ఇద్దరు వాగులో పడి కొట్టుకుపోయారు. వీరు వాగులో ఉన్న చెట్లను పట్టుకుని కేకలు పెడుతున్నారు. ఇవతల ఒడ్డున ఉన్న భార్య, వాగు ప్రవాహం చూడడానికి వచ్చిన ప్రజలు కేకలు వేయడంతో గ్రామస్తులు, కొందరు యువకులు స్పందించి రబ్బరు ట్యూబ్ సహాయంతో వారిని సురక్షితంగా బయటకు తీశారు. లేకపోతే పెద్దప్రమాదం జరిగి ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఒడ్డుకు చేరిన వెంకటేశ్వర్లు ఊపిరి పీల్చుకున్నారు. యువకులు చేసిన సహాయంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాత్రి నల్లమల అడవుల్లో కురిసిన వర్షానికి ఈ ప్రాంతంలో కుంటలు నిండి వాగులో నీరు చేరింది.

వాగులో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులు

- రక్షించిన పోలీసులు
- అంబవరం రైల్వే బ్రిడ్జి వద్ద చిక్కుకుపోయిన అగ్నిమాపక వాహనం
- ఉప్పొంగిన సగిలేరువాగు



వాగులో చిక్కుకున్న వారిని బయటకు తీసిన సీఐ, పోలీసు సిబ్బంది



అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డులో చిక్కుకుపోయిన అగ్నిమాపక వాహనం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం గ్రామ సమీపంలో ఉప్పువాగు ఉధృతంగా పారుతున్న సమయంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు వాగులో పడి కొట్టుకుపోయిన సంఘటన ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షం కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి సగిలేరు వాగు పెద్ద ఎత్తున ఉప్పొంగింది. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన రహీమ్, ఖలీల్ అనే ఇద్దరు ఒకే బైక్ పై అంబవరం గ్రామంలో దర్గా వద్దకు వెళ్లేందుకు ఆదివారం వేకువజామున బయలుదేరారు. మార్గమధ్యంలో అంబవరం రోడ్డులోని ఉప్పువాగు ఉధృతంగా పారుతున్న సమయంలో వారు బైక్‌పై అటువైపుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈలోగా బైక్‌తో పాటుగా వారు ఇద్దరూ వాగులో పడి కొంత దూరం కొట్టుకుపోయారు. వారి కేకలను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు సీఐ దేవప్రభాకర్ తన సిబ్బందితో సంఘటనా స్థలం వద్దకు చేరుకుని వాగులో చిక్కుకున్న ఇద్దరు యువకులను రక్షించి క్షేమంగా బయటకు తీశారు. యువకులను రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది వాహనం అంబవరం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ రోడ్డు ముందుగానే రైల్వే అధికారులు డబ్లింగ్ పనుల కోసం మూతవేసి పనులు నిర్వహిస్తున్నారు. అది గమనించని అగ్నిమాపక సిబ్బంది యువకులను రక్షించాలనే తొందరపాటుగా మూతపడి ఉన్న రోడ్డులో వెళ్లేందుకు ప్రయత్నించగా వారి వాహనం వర్షపు నీటితో నిండి ఉన్న రోడ్డు గుంతల్లో చిక్కుకుపోయింది.

హత్య చేసి..దాచేసి



పొలాల్లో బయటపడిన సాత్విక్‌షాలోన్ మృతదేహం



పొలాల్లో గాలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు (ఫైల్)

- నజ్జుపొట్టులో కప్పిపెట్టిన కిడ్నాప్‌నకు గురైన బాలుడి మృతదేహం
- బాలుడి శవం ఆచూకీ చూపిన గాలి, వాన
- కొట్టి చంపారా.. గొంతునులిమి చంపారా..?
- బాలుని హత్యపై పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

కనిగిరి రూరల్: సీఎస్‌పురం మండలం చింతలపాలెం ఎస్సీ కాలనీలో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన బాలుడు సాత్విక్ షాలోన్ (16) నెలలు ఆదివారం సాయంత్రం విగత జీవిగా కనిపించాడు. నాలుగు రోజుల నుంచి ఎస్పీ ఆదేశాలతో క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్ రామరాజుతో పాటు, కనిగిరి, పామూరు సీఐలు, ఎస్సైలు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. అయితే శనివారం రాత్రి వచ్చిన గాలి వానకు బాలుడి మృతదేహం కప్పిన సజ్జపొట్టు కుప్ప ఎగిరిపోయి... శవం బయటపడింది. బాలుడు మృతి చెంది నాలుగు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిన స్థితిలో దుర్వాసన వెదజల్లడంతో పశువుల కాపరి దాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పరిశీలించిన పోలీసులు మృతదేహం బాలుడు సాత్విక్‌ది గా నిర్ధారించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ అంకితా సురానా:

బాలుడు సాత్విక్ షాలోన్ మృతి ఘటనపై విచారించేందుకు ట్రైనీ ఎస్పీ అంకితాసురాన ఆదివారం రాత్రి చింతలపాలెం ఎస్సీకాలనీ సమీపంలో ఘటనాస్థలానికి వెళ్లి డీఎస్పీ, సీఐలతో చర్చించారు.

పలు కోణాల్లో దర్యాప్తు ..

బాలుడి మృతదేహం కాలనీకి సమీప ప్రదేశంలోనే.. పంట పొలాల్లో పడి ఉండటంతో పోలీసు వర్గాలు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. బాలుడిని హత్య చేసిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందిన వారై ఉండవచ్చనే ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అనారోగ్య స్థితిలో ఉన్న 16 నెలల బాలుడ్ని అంత దారుణంగా చంపాల్సిన అవసరం ఎవరికి ఉంటుందనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సాంకేతికతను కూడా ఉపయోగిస్తున్నారు. గత నెల 30న ఎస్సీ కాలనీలో.. మృతుని ఇంటి సమీపంలో.. మృతదేహం లభ్యమైన ప్రదేశంలో ఏఏ సిగ్నల్స్ పనిచేశాయి.. బయట వ్యక్తులు ఎవరైనా అ ప్రాంతంలోకి వచ్చారా అనే కోణంలో ముమ్మర దర్యాప్తు సాగుతోంది.

కొట్టి చంపారా.. గొంతునులిమి చంపారా..?

బాలుడి మృతదేహం లభించిన స్థితిని బట్టి చూస్తే.. కొట్టి చంపారా.. లేక.. గొంతు నులిమి చంపారా అనేది అర్థం కావడం లేదు. బాలుడ్ని చంపిన ఆగంతకులు పంట నూర్పిడి పొట్టును పైన కప్పి మృతదేహాన్ని దాచారు. దీంతో నాలుగు రోజులుగా పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నా మృతదేహం ఆచూకీ దొరకలేదు. అయితే సోమవారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత బాలుడ్ని ఎలా చంపారనే దానిపై ఒక నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. బాలుడి హత్యకు గురై నాలుగు రోజులు కావడం వల్లే డీకంపోజ్ అయి తల, మొండెం, కాళ్లు విడి పోయినట్లు పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఏది ఏమైనా బాలుడి హత్య కేసు మిస్టరీ సోమవారం ఓ కొలిక్కిరానుంది.

దొంగే దొంగా అన్నట్లు చంద్రబాబు తీరు

- వైఎస్సార్ పేరు చార్జిషీట్‌లో పెట్టింది కాంగ్రెస్‌కు తెలియదనడం పక్కదారి పట్టించేందుకే..
- నోటీసులు రావడంతోనే బీజేపీ పెద్దల ప్రాపకం కోసం చంద్రబాబు పాకులాట
- మీడియాతో టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు: ఒక్కో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లను తెలుగుదేశం పార్టీ చేర్పించిందని, బూత్‌లెవల్ సహాయకులు ప్రత్యేకంగా దృష్టిసారించి వాటిని గుర్తించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. దొంగ ఓట్లతో గద్దెనెక్కాలనుకునే చంద్రబాబుకు నేడు ఆ ఓట్లు రద్దు అవుతుండడంతో ఓటమి భయం పట్టుకుని దానిని సైతం తనకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. దొంగే దొంగ దొంగ అని అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉందని విమర్శించారు. ఆదివారం ఉదయం ఒంగోలు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఏ ఎండకా గొడుగు పట్టుకునే రకం అని, అందువల్లే నాడు రాష్ట్రంలో ప్రధానిని సైతం కాలుపెట్టనివ్వనని హెచ్చరించి, నేడు ఐటీ నోటీసులు రావడంతోనే బీజేపీ పెద్దల ప్రాపకం కోసం ఢిల్లీలో ప్రాధేయపడుతున్నారన్నారు. ఒంటరిగా పోటీచేయలేక మూడు పార్టీలు కలిసి పోటీచేయాలని చంద్రబాబు తహతహలాడుతున్నారని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తాను అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే లక్ష్యంగా ఒంటరిగా పోటీచేస్తున్నారన్నారు. అక్రమంగా నిధులు వచ్చాయని నిర్ధారణ అయినందునే ఐటీశాఖ నోటీసులు జారీచేస్తుందని, దీనికి చంద్రబాబు ఇప్పుడు సమాధానం ఇవ్వాలన్నారు. 2014–19 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో జరిగిన అక్రమాల వల్లే నేడు నోటీసులు అందుకున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌ది వింత నాటకం:

వైఎస్సార్ పేరు చార్జిషీటులో పెట్టింది సోనియా గాంధీకి తెలియదంటూ కాంగ్రెస్ పార్టీ వింత నాటకం ఆడడం విడ్డూరమని, రాష్ట్ర ప్రజలందరికీ ఆ విషయం తెలుసుకాబట్టే కాంగ్రెస్‌ను తిరస్కరించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషిచేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు, వైఎస్సార్ కుటుంబాన్ని ఎంతగా ఇబ్బంది పెట్టిందీ ప్రజానీకానికి తెలుసన్నారు. ఇవాళ తెలియదు అంటే నమ్మే జనం లేరన్నారు. లోకేష్ మాత్రమే కాదని, పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చన్నారు. కాకుంటే ప్రజాసమస్యల మీద చేయాలి కానీ, సీఎంను దూషించడమే పనిగా పెట్టుకుంటూ ప్రజలను రెచ్చగొట్టేలా, ఉద్రిక్తతలు సృష్టించేలా మాట్లాడడం సరికాదన్నారు.

కేంద్రం ఒక వైపు జమిలి ఎన్నికలపై కసరత్తు ప్రారంభించిన దృష్ట్యా ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగానే ఉందన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జనం మాత్రం ఇప్పటికే వైఎస్ జగన్ వైపు డిసైడ్ అయ్యారన్నారు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలు చేసినా, చంద్రబాబు పర్యటనలు, లోకేష్ పాదయాత్రలు ఎన్ని చేసినా ఎంతమందితో పొత్తుతో సై అన్నా ఓడించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా, రాష్ట్రానికి సంబంధించిన పథకాల అమలు విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. తనకు టికెట్ ఇవ్వాలా లేదా అనేది పార్టీ అధ్యక్షుల నిర్ణయం అని, ఆయన ఎలా ఆదేశిస్తే అలా నడుచుకోవడమే తనకు ఇష్టం అన్నారు. ప్రత్యేక హోదాపై పోరును ఎప్పుడూ విడనాడలేదని, ఇప్పటికిప్పుడు ప్రత్యేక హోదా రాకపోయినా వచ్చే ఎన్నికల్లో ఎక్కువమంది ఎంపీలను గెలిపించుకోవడం ద్వారా 2024 తరువాత కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా సాధించుకోగలమనే విశ్వాసం ఉందన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా విజయం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాల సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. మండల కేంద్రంలోని 1వ సచివాలయం పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి కావడంతో వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. సంక్షేమం –అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జగన్‌మోహన్ రెడ్డి కరోనా కష్టకాలంలోకూడా పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పనులను వేగవంతంచేసి మొదటి టన్నెల్ పూర్తి చేశారన్నారు. రెండో టన్నెల్ పనులు సైతం మరికొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి మెరుగైన సేవలందిస్తున్నారని వివరించారు. గ్రామ సచివాలయాలు గ్రామీణ ప్రజల పాలిట ఆధునిక దేవాలయాలుగా మారాయన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను మంత్రి సురేష్ వివరించారు. ప్రభుత్వ పథకాలతో కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధిపొందారో వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహశీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీఓ విజయ, పంచాయతీ కార్యదర్శి మోహనరావు, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ దూదేకుల ఖాసిం పీరా, సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మండల నాయకులు గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, అల్లు రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ నూతన పింఛన్ల పంపిణీ

- ప్రారంభించనున్న మంత్రి ఆదిమూలపు

యర్రగొండపాలెం: వైఎస్సార్ నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభిస్తారని డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం మండలాలకు చెందిన పింఛన్ మంజూరైన లబ్ధిదారులు హాజరవుతారని, ఆయా మండలాల ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పొగాకు పంట పరిమితి యథాతథం

- 2023-24 పంట సీజన్‌కు ప్రకాశం రీజియన్‌లో 89.9 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు బోర్డు అనుమతి
- ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు, ఎస్‌బీఎస్ పరిధిలో 35.50క్వింటాళ్లకు పరిమితి
- గత ఏడాది భారీగా దిగుబడి, గరిష్ట ధరలు నమోదు


పొగాకు పంట

కందుకూరు: గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులకు లాభాల పంట పండింది. దిగుబడుల దగ్గర నుంచి ధరల వరకు రైతులకు అన్ని ప్రతికూల అంశాలే. గతంలో ఎన్నడూ లేని విధంగా గరిష్ట ధరలు నమోదు కావడంతో రైతులు భారీగా లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ఏడాది భారీ విస్తీర్ణంలో పొగాకు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. అయితే 2023-24 పంట సీజన్‌కు సంబంధించి పొగాకు పంట పరిమితిని గతేడాది పరిమితినే బోర్డు కొనసాగించింది. రాష్ట్రంలో 142 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు అనుమతి ఇవ్వగా ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 89.9 మిలియన్ కేజీలు నిర్ణయించింది. 2022-23 పంట సీజన్‌కు ఈ కోటాను నిర్ణయించగా ఈ ఏడాది కూడా ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకుండా నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది వచ్చిన లాభాలతో రైతులు పంట పరిమితిని పెంచాలని బోర్డును డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ బోర్డు మాత్రం ఈ ఏడాదికి పంట పరిమితిలో ఎలాంటి మార్పులు చేయకుండా గతేడాది పరిమితినే యధాతథంగా ఉంచింది.

ప్రకాశం రీజియన్‌లో 89.9మిలియన్ కేజీలకు అనుమతి

పొగాకు బోర్డు మొత్తం 142 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతించగా దీనిలో ఎస్‌బీఎస్ (సదరన్ బ్లాక్ సాయిల్) పరిధిలో 41.6 మి.కేజీలు, ఎస్‌ఎల్‌ఎస్ (సదరన్ లైట్ సాయిల్) పరిధిలో 48.3 మి.కేజీలు, ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలో 49.31 మి.కేజీలు, ఎన్‌బీఎస్ పరిధిలో 3మి.కేజీల పొగాకు ఉత్పత్తులను పండించవచ్చు. దీనిలో భాగంగా ప్రకాశం రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 89.9మిలియన్ కేజీల పొగాకు పండించుకునేందుకు 2023-24 పంట సీజన్‌కు బోర్డు అనుమతిచ్చింది. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలు, ప్రకాశం జిల్లా పరిధిలో ఒంగోలు-1, ఒంగోలు-2, కొండపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలున్నాయి. వీటిలో దక్షిణ ప్రాంత తేలిక నేలల పరిధిలో (ఎస్‌ఎల్‌ఎస్) 6 వేలం కేంద్రాలు, సదరన్ బ్లాక్ సాయిల్(ఎస్‌బీఎస్) పరిధిలో 5 వేలం కేంద్రాలున్నాయి. అదే సందర్భంలో బ్యారన్ పరితిమిని కూడా నిర్ణయిస్తూ బోర్డు నిర్ణయించింది. ఇది ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలో 2.90 హెక్టార్లో పంట సాగు చేసుకునేందుకు, బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లను, ఎస్‌బీఎస్ పరిధిలో 1.90హెక్టార్ హెక్టార్లో 35.50 క్వింటాళ్ల ఉత్పత్తిని అమ్ముకునేలా బోర్డు నిర్ణయం తీసుకుంది.

గత సీజన్‌లో భారీగా ఉత్పత్తి

అయితే పొగాకు బోర్డు విధించిన పరిమితిని దాటి భారీగా పొగాకును రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం 2022-23 పంట సీజన్‌కు జరిగిన అమ్మకాలే ఇందుకు నిదర్శనం. 2022-23 పంట సీజన్‌కు కూడా బోర్డు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 89.9మిలియన్ కేజీల పొగాకును పండించేందుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ముగిసిన అమ్మకాల ప్రకారం చూస్తే 123.10 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయి. అంటే బోర్డు పరిమిని దాటి దాదాపు 33.2 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులు అధికంగా అమ్మకం జరిగింది. వీటిలో ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలోని 6 వేలం కేంద్రాల పరిధిలో 57.23 మిలియన్ కేజీలు, ఎస్‌బీఎస్ పరిధిలో 65.87మిలియన్ కేజీల పొగాకు అమ్మారు. ఇక ఎస్‌ఎల్‌ఎస్ పరిధిలో ఉన్న నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1లో 13.1మి.కేజీలు, కందుకూరు-2లో 11.మి.కేజీలు కలిగిరిలో 5.5మి.కేజీలు, డీసీపల్లిలో 8.3 మి.కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు పొగాకు సాగు పరిమితిని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు పరిమితిని 170 మిలియన్ కేజీలకు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

బోర్డు అనుమతి మేరకే సాగు చేసుకోవాలి

పొగాకు మార్కెట్ ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉంటాయి. రైతులు ఈ ఏడాది లాభాలను చూసి వచ్చే పంట సీజన్‌కు భారీగా పొగాకు సాగు చేయకుండా పంట నియంత్రణ పాటించాలి. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పండిస్తే మార్కెట్ ఆశాజనకంగా ఉంటుంది.

– ఎం లక్ష్మణరావు, ఆర్‌ఎం ఎస్‌ఎల్‌ఎస్

వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు

- ఎస్పీ మలికాగర్గ్


ఎస్పీ మలికా గర్గ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: ఆన్‌లైన్లో పరిచయమైన స్నేహితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు. సైబర్ స్టాకింగ్ గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఈ మెయిల్, ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియా ద్వారా వేధించడాన్ని సైబర్ స్టాకింగ్ అంటారని వివరించారు. ప్రమాదకర విషయాలను మెసెజీలు పంపించడం, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడం, పరువు భంగం కలిగించడం, సెక్స్ కోసం విన్నపం చేయడం, తప్పుడు ఆరోపణలకు దిగడం లాంటి చర్యల ద్వారా వేధించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడేవారు బాధితుడికి బాగా తెలిసిన వ్యక్తులై ఉండవచ్చని, పూర్తిగా అపరిచితులు కూడా కావచ్చన్నారు. మీ ఫోన్ నెంబర్, మీ స్నేహితుల నంబర్ లొకేషన్‌ను ట్రాక్ చేసి తద్వారా పలురకాలుగా వేధింపులకు పాల్పడతారని తెలిపారు. ఇలాంటి వాటి బారిన పడకుండా కొన్ని జాగ్రతలను సూచించారు.

ఈ జాగ్రతలు పాటించండి...

- ఏదైనా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు ప్రైవసీ సెట్టింగ్‌ను పరిమితం చేయడం అవసరం.
- ఎవరైనా స్నేహితుల అభ్యర్థనను అంగీకరించే ముందు సోషల్ మీడియాలో సదరు వ్యక్తి ప్రామాణికతను తరచుగా తనిఖీ చేయండి. సోషల్ మీడియాలో అనామక ఆన్‌లైన్ స్నేహితులను నమ్మవద్దు.
- మీ వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను పంచుకోవద్దు.
- మీ వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పబ్లిక్ భాగస్వామ్యం చేయవద్దు.
- మీ సోషల్ మీడియా స్నేహితుడు చేస్తున్న కామెంట్స్‌ను గమనిస్తూ ఉండండి.
- తప్పుగా ప్రవర్తిసుంటే వెంటనే బ్లాక్ చేయడం, రిపోర్టు చేయడం, పోలీసుల దృష్టికి తీసుకొని వెళ్లడం చేయండి.
- ఒకవేళ సైబర్ స్టాకింగ్‌కు గురైతే వెంటనే మీ దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయండి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


నాయుడు మహేష్ (ఫైల్)


ఏలిక సాయికుమార్ (ఫైల్)


ఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహాలు


లారీ, మోటారుసైకిల్ ఢీకొన్న దృశ్యం


ఆస్పత్రిలో మహేష్

సింగరాయకొండ: ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొన్న ఘటనలో మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో సింగరాయకొండ మండల పరిధిలోని మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో కందుకూరు రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని యర్రగుంటపాలేనికి చెందిన ఎలిక సాయి కుమార్ (27), బండపాలేనికి చెందిన నాయుడు మహేష్ (28) మోటారుసైకిల్‌పై కందుకూరు నుంచి సింగరాయకొండవైపు వెళ్తున్నారు. మోటారుసైకిల్ పలుకూరు అడ్డరోడ్డు దాటి నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి ప్రకాశం జిల్లాలోకి రాగానే ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేసి ముందుకెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్న సాయికుమార్, నాయుడు మహేష్‌లకు తీవ్రగాయాలు కావడంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. కొనఊపిరితో ఉన్న మహేష్‌ను, సాయికుమార్ మృతదేహాన్ని కందుకూరు ఏరియా ఆస్పత్రికి ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో తరలించారు. మహేష్‌కు చికిత్స చేసే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటికే మహేష్ కూడా మరణించాడు. ఈ ఘటనలో మోటారుసైకిల్ పూర్తిగా ధ్వంసమైంది. సాయి, మహేష్ ఇద్దరూ యర్రగుంటపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానితులను పిలవడానికి సింగరాయకొండ వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు సాయి బంధువులు తెలిపారు. సాయి కందుకూరులోని హరిణి ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఒక చెల్లెలు ఉంది. చేతికందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృత్యువాతపడటంతో సాయి తండ్రి మాధవరావు ఆవేదన చూపరులను కలచివేసింది. ఇటీవల వీరు నూతనంగా ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశం కూడా చేశారు. నాయుడు మహేష్ ఇటీవల వరకు హైదరాబాద్‌లో ఉండి ప్రస్తుతం కందుకూరు వచ్చి ఆటో నడుపుకుంటూ వాయిదా పద్ధతిపై ఫర్నిచర్ అమ్ముతుంటాడు. ఇతనికి వివాహమైంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీరామ్ వెల్లడించారు.

పిడుగులు పడి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం


రంగాయపాలెంలో పిడుగు పడి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తపట్నం: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో కొత్తపట్నం, పాదర్తి, రంగాయపాలెంలో పిడుగులు పడి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. వాటిలోని ఆయిల్ పూర్తిగా బయటకు వచ్చింది. దానివలన చుట్టుపక్కల ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు పలువురు తెలిపారు. మెరుపులు, ఉరుములతో పెద్దగా శబ్దాలు రావడంతో రాత్రంతా ప్రజలు భయంభయంగా గడిపారు. మండలంలోని 15 పంచాయతీల్లోనూ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. గడిచిన నెలరోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు మండిపోయాయి. ఈ క్రమంలో భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడటం కాస్త ఉపశమనం కలిగించింది. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

6 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

మార్కాపురం రూరల్: మండలంలోని కొండేపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 6 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, రెండో బహుమతి రూ.80 వేలను మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మూడో బహుమతి రూ.60 వేలను లక్ష్మీచెన్నకేశవ యూత్ అసోషియేషన్ కొండేపల్లి, నాల్గవ బహుమతి రూ.40 వేలు మందటి ఆవులరెడ్డిలు అందచేస్తారన్నారు. వివరాలకు 9440837199, 8142021443 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదింటి బిడ్డకు విదేశీ విద్య

- అమెరికా చదువుకు ఎంపికైన నవీన
- తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ కూలీలు
- సర్వత్రా హర్షం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నవీన


తల్లిదండ్రులతో నవీన

మార్కాపురం: వారిది రెక్కాడితే కానీ.. డొక్కాడని పేద కుటుంబం. తమ కుమార్తె బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ఆశించారు. అయితే ఇంటర్ సెకండియర్ లోనే అమెరికా వెళ్లి తమ కుమార్తె చదువుతుందని కలలో కూడా ఊహించలేదు. అమెరికాకు వెళ్లారని ఎవరైనా చెబితే వినడమే తప్ప తమ కుమార్తె స్వయంగా అమెరికాకు వెళ్తుందని కళాశాల ప్రిన్సిపల్ చెప్పేదాకా తెలియదు. రాష్ట్ర విద్యారంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువుకు, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల ఫలితంగా పేదింటి అమ్మాయి అమెరికా చదువుకు ఎంపికైంది. కెన్నడీ లూగర్ -యూత్ ఎక్సేంజ్ అండ్ స్టడీ (కేఎల్-వైఈఎస్) కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా అందులో మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థిని దారా నవీన ఎంపికైంది. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన దారా కేశయ్య, ఆదిలక్ష్మ్మల కుమార్తె నవీన 1 నుంచి 4వ తరగతి వరకూ స్వగ్రామమైన పుచ్చకాయలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. 5 నుంచి ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ వరకూ రాయవరం సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతోంది. 10వ తరగతిలో 541 మార్కులు రాగా, ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో 470 కి గానూ 418 మార్కులు సాధించింది. విదేశీ విద్య పథకం కింద ఎంపికైన నవీన అమెరికాలోని మేరీ ల్యాండ్స్ స్టేట్‌లో డెల్టాస్ విల్ ప్రాంతంలోని హైపాయింట్ హైస్కూల్‌లో 10 నెలల పాటు చదువుకోనుంది. ఇందుకయ్యే ఖర్చంతా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కుతోపాటు ట్యాబ్, విమాన టికెట్స్‌ను అందించారు. కెన్నడీ లూగర్-యూత్ ఎక్సేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాంను అమెరికాకు చెందిన సాంస్కృతిక వ్యవహారాల శాఖ నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికై న విద్యార్థులు 10 నెలల పాటు అక్కడే చదువుకుంటారు. ఒక్కొక్క విద్యార్థికి నెలకు 200 డాలర్లను స్టైఫండ్‌గా అందిస్తారు. రాబోయే పదిరోజుల్లో ఆమెరికాకు వెళ్తారు. వీరికి అవసరమైన నిత్యావసరాలు, బ్యాగ్‌లు, దుస్తులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సమకూరుస్తుంది. దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థులు ఎంపిక కాగా మన రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.

అమెరికా వెళ్తుందని ఊహించలేదు..

తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, కేశయ్యలు మాట్లాడుతూ తమ కుమార్తె దేశాలు దాటి అమెరికాకు వెళ్తుందన్న ఆలోచనే సంతోషాన్నిచ్చిందని తెలిపారు. పెద్ద చదువులకు అమెరికాకు వెళ్తుంది అనుకున్నామే కానీ ఇంటర్‌లోనే అమెరికాకు వెళ్తుందని ఊహించలేదన్నారు.

ప్రజలకు సేవలందిస్తా



బీటెక్ చదివిన తరువాత సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్ అయి ప్రజలకు సేవలందిస్తాను. వెనుకబడిన ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో ప్రవేశపెట్టిన మార్పుల వలన నేను అమెరికాలో పది నెలల పాటు చదువుకునే అదృష్టం దక్కింది. ఆయనకు రుణపడి ఉంటాను. – నవీన, విద్యార్థిని

చదువులో బెస్ట్:



5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకూ నవీన ఇక్కడే చదివింది. చదువులో మంచి మార్కులు వస్తున్నాయి. క్లాసులో కూడా లెక్చరర్లు చెప్పే పాఠాలు చక్కగా వింటుంది. మా పాఠశాల విద్యార్థిని నవీన అమెరికాకు వెళ్లడం గర్వకారణంగా ఉంది.

– ఆశాలత, ప్రిన్సిపల్

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఒంగోలు టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతికి శారీరకంగా దగ్గరై మోసం చేసిన ఏఆర్ కానిస్టేబుల్‌పై ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లా ఉలవపాడు మండల కేంద్రానికి చెందిన డి.సందీప్ ఒంగోలులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఒక యువతితో అతడికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సందీప్.. ఆ యువతికి శారీరకంగా కూడా దగ్గరయ్యాడు. అయితే, ఆమెను పెళ్లి చేసుకోకపోగా, ఇటీవల మరో యువతిని పెళ్లాడేందుకు నిశ్చితార్థం కూడా చేసుకున్నాడు. దీనిపై మోసపోయిన యువతి ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భక్త వత్సలరెడ్డి తెలిపారు.

సోనాబోట్లను అడ్డుకోండి

- మత్స్యశాఖ అధికారులకు మత్స్యకారుల వేడుకోలు


ఊళ్లపాలెం సముద్ర తీరంలో తీరానికి దగ్గరగా వేటాడుతున్న సోనాబోట్లు

సింగరాయకొండ: మండల పరిధిలోని పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరప్రాంతంలో సముద్రతీరప్రాంత నిబంధనలకు విరుద్ధంగా చేపలవేట సాగిస్తున్న తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనాబోట్లను అడ్డుకోవాలని మండలంలోని మత్స్యకార గ్రామాల ప్రజలు జిల్లా మత్స్యశాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఒక్కో రోజు 7 లేక 8 బోట్లు వస్తుండగా మూడు రోజుల నుంచి 10 నుంచి 15 బోట్ల వరకు చేపల వేట సాగిస్తున్నాయని ఆదివారం కూడా సోనాబోట్లు తీరంలో హల్‌చల్ చేశాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చేపల వేట నిషేధం ముగిసిన తరువాత చేపల వేట ఆశాజనకంగా లేదని, జూన్ 16వ తేదీ నుంచి కేవలం 10 రోజులు మాత్రమే చేపల వేట సాగించామని మత్స్య సంపద లేక రోజువారీ ఖర్చులు కూడా రాకపోవటంతో గత కొద్దిరోజులుగా బోట్లు తీరానికే పరిమితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ కడలూరు బోట్లు సముద్ర తీరానికి అతి దగ్గరలో చేపలవేట సాగించటంతో ఉన్న కాస్త మత్స్య సంపద కూడా లేకుండా పోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికైనా మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు సోనాబోట్లను అడ్డుకోవటానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. పాకల పోతయ్య గారి పట్టపుపాలెం మత్స్యకారుడు ప్రళయకావేరి రోశయ్య, ఊళ్లపాలెం మత్స్యకారుడు గొల్లపోతు నాగరాజు తదితరులు మాట్లాడుతూ మత్స్యశాఖాధికారి చంద్రశేఖరరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చీరాల రూరల్: రెండు వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటనలు ఆదివారం స్టూవర్టుపురం-బాపట్ల రైల్వేస్టేషన్ల మధ్య చోటుచేసుకున్నాయి. చీరాల జీఆర్పీ ఎస్సై సీహెచ్. కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. స్టూవర్టుపురం-బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య కంకటపాలెం రైల్వేగేటు, రిలయన్స్ పెట్రోలు బంకు వెనుక దిగువలైన్ రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై చెప్పారు. మృతుని వయస్సు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, 5.5 ఎత్తు కలిగి ఉంటాడని, మృతుడు నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో సంఘటనలో..

స్టూవర్టుపురం-బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య దిగువలైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై కొండయ్య తెలిపారు. మృతుని వయస్సు 30 ఏళ్లు ఉంటాయని, 5.6 అడుగులు ఎత్తు, సిమెంట్ రంగు నిండుచేతులు చొక్కా, నీలం రంగు లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, ఎవరికైనా మృతుల ఆధారాలు తెలిస్తే 94406 27646 సమాచారం అందించాలన్నారు. ఈ రెండు ఘటనల్లో మృతులు ఇరువురు రైలులో ప్రయాణిస్తూ రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చునని ఎస్సై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతుడు చిన్నబ్బాయి

అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టటంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన ఆదివారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..అద్దంకిలోని కాలువ కట్టపై నివాసం ఉంటున్న గాలేటి చిన్నబ్బాయి (50) కోత మిషన్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక ఏడీబీ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. చిన్నబ్బాయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదం వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.